# కందిలి

www.kandilinews.com

న్యూస్.. దారిచూపే దీప శిఖ

సోమవారం | 01.06.2026 సంపుటి: 01 | సంచిక: 263 | వెల: రూ. 4 /- TGTEL/25/A 1800




మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.


ఇట్లు.. టీం కందిలి

# సీఎం రేవంత్ రెడ్డికి ఏం చెప్పాలి!

- నాంపల్లిలో ఆటోడ్రైవరుతో జగ్గారెడ్డి ఆసక్తికర సంభాషణ
- ఆటో డ్రైవర్ల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళతానని భరోసా

2 లో





## 24 గంటల కరెంటిస్తేనే..

# ఓట్లు అడుగుతామని ప్రమాణం చేయండి!

- సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరిన హరీశ్ రావు
- రైతు డిస్కంతో వ్యవసాయానికి ఉరితాడు
- పగలు మాత్రమే ఉండే సోలార్ పవర్ తో 24గంటల కరెంట్ ఎలా ఇస్తారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి
- ఆర్పీడీసీఎల్ ఏర్పాటుతో లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు కరెంట్ కష్టాలు... సాగు, తాగునీటికి ఎసరు
- డిస్కంల అప్పులపై ముఖ్యమంత్రివి పచ్చి అబద్ధాలు
- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఏటా రూ.పదివేల కోట్ల బాకీలు
- విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే కుట్రలో భాగంగానే మూడో డిస్కం ఏర్పాటు
- తక్షణమే మూడో డిస్కం ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- పూటకో పార్టీ మారే రేవంత్ రెడ్డికి నా గురించి మాట్లాడే నైతికత లేదు
- తన ప్రయాణం, తన జీవితం కేసీఆర్ తోనే అంటూ పునరుద్ఘాటించిన హరీశ్ రావు

3 లో

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో.. పటాన్ చెరులోని

# 9 డివిజన్లను క్లీన్ స్వీప్ చేస్తాం!

4 లో



# సీఎం రేవంత్ రెడ్డికి ఏం చెప్పాలి!

- **నాంపల్లిలో ఆటోడ్రైవరుతో జగ్గారెడ్డి ఆసక్తికర సంభాషణ**
- **ఆటో డ్రైవర్ల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళతానని భరోసా**

**కందిలి, సంగారెడ్డి**

హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో ఆటో డ్రైవరు, జగ్గారెడ్డికి మధ్య ఆసక్తికరణ సంభాషణ చోటు చేసుకుంది. రోడ్డు పక్కన నిల్చొని ఉన్న ఆటో డ్రైవరుతో జగ్గారెడ్డి ముచ్చటించారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు ఏం చెప్పాలని ఆటోడ్రైవరును ఆయన అడిగారు.

**సంభాషణ సాగింది ఇలా!**

సీఎంరేవంత్ రెడ్డికి,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు ఏమైనా చెప్పాలా అంటూ జగ్గారెడ్డి ఈ సందర్భంగా ఆటో డ్రైవరును అడిగారు. ఆటో ఛార్జీలు పెంచాలని ఆటో డ్రైవరు కోరారు. ఆటో చార్జీలు పెంచితే ప్రజలు మమ్మల్ని తిట్టుకుంటారు కదా అని జగ్గారెడ్డి ప్రతిసమాధానమిచ్చారు. పెట్రోల్,డీజిల్ రేట్లు పెంచితే ప్రధాని మోదీని మనం తిడుతున్నాం కదా అని ఆటో డ్రైవర్ తో ఆయన అన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.10 ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, ఆ డబ్బులు ఇప్పించాలని ఆటో డ్రైవర్ కోరారు.''కేసీఆర్ రాష్ట్రంలో ఉన్న ఖజానా మొత్తం ఖాళీ చేశారు.. లేకపోతే మీకు ఇవ్వాల్సిన రూ.10వేలు ఇవ్వడానికి సీఎం రేవంత్ రెడ్డికి పెద్ద ఇబ్బంది కాద''ని జగ్గారెడ్డి వివరించారు. ఖజానా నిండితే సీఎం రేవంత్ రెడ్డి ఆటో కార్మికులకు ఆ డబ్బులు తప్పక ఖాతాలో జమచేస్తారని ఆయన తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్తానని ఈ సందర్భంగా ఆటో డ్రైవరుకు జగ్గారెడ్డి భరోసా ఇచ్చారు.





# ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన.. నిర్మలా జగ్గారెడ్డి!

- **తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని స్పష్టీకరణ**
- **పథకమేదైనా మహిళలే ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడి**

**కందిలి, సంగారెడ్డి**

తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. అందుకే ఏ పథకం అమలు చేసినా, మొదటి ప్రాధాన్యత మహిళలకే ఇస్తున్నామన్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని రామ్ నగర్, 22వ వార్డులో గ్రామైక్య సంఘ మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. గ్రామైక్య మహిళా సంఘ సభ్యులకు ఆమె స్వయంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. రామ్ నగర్, రామ్ మందిర్ లోని నిర్మలా జగ్గారెడ్డి నివాసంలో, స్థానిక కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది.

**గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు.. బెదురు కోసం వాడారు!**

ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతిగా ఉందన్నారు. ఏ ప్రభుత్వ కార్యక్రమం మొదలుపెట్టినా మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుందని వివరించారు. గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన చీరలను పొలాల వద్ద బెదురు కోసం వాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ కూన వనితా సంతోష్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ అశోక్ రెడ్డి,వార్డు పెద్దలు కల్పన తదితరులు పాల్గొన్నారు.







## 24 గంటల కరెంటిస్తేనే..

# ఓట్లు అడుగుతామని ప్రమాణం చేయండి!

- సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరిన హరీశ్ రావు
- రైతు డిస్కంతో వ్యవసాయానికి ఉరితాడు
- పగలు మాత్రమే ఉండే సోలార్ పవర్ తో 24గంటల కరెంట్ ఎలా ఇస్తారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి
- ఆర్పీడీసీఎల్ ఏర్పాటుతో లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు కరెంట్ కష్టాలు... సాగు, తాగునీటికి ఎసరు
- డిస్కంల అప్పులపై ముఖ్యమంత్రివి పచ్చి అబద్ధాలు
- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఏటా రూ.పదివేల కోట్ల బాకీలు
- విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే కుట్రలో భాగంగానే మూడో డిస్కం ఏర్పాటు
- తక్షణమే మూడో డిస్కం ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- పూటకో పార్టీ మారే రేవంత్ రెడ్డికి నా గురించి మాట్లాడే నైతికత లేదు
- తన ప్రయాణం, తన జీవితం కేసీఆర్ తోనే అంటూ పునరుద్ఘాటించిన హరీశ్ రావు





**కందిలి, సిద్దిపేట**

సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకురానున్న 'రైతు డిస్కం' ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర విద్యుత్ రంగ భవిష్యత్తుపై పలు కీలక అంశాలను ఆయన సాక్ష్యాలతో సహా మీడియా ముందు ఉంచారు.

### హరీశ్ రావు కామెంట్స్!

- 24 గంటల ఉచిత కరెంట్ కోసమే ఆర్పీడీసీఎల్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పడం పచ్చి అబద్ధం. ఆర్పీడీసీఎల్ తో రైతులకు ఉచిత విద్యుత్ రాకపోగా, అది వ్యవసాయ రంగానికి ఉరితాడుగా మారబోతోంది.
- ఈఆర్సీ ముందు జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారికంగా రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ద్వారా రైతాంగానికి 3 గంటల కరెంట్ చాలు అని చెప్పించింది.
- గతంలో రేవంత్ రెడ్డి కూడా అదే మాట అన్నారు. దమ్ముంటే 24గంటల ఉచిత విద్యుత్‌ను రైతులకు ఇస్తేనే నేను ఎన్నికల్లో ఓట్లు అడుగుతాను అని సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణం చేయాలని నేను ఛాలెంజ్ చేస్తున్నాను.
- ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా 13గంటలకు మించి కరెంట్ రావడం లేదు. గుజరాత్‌లో 7 గంటలు, కర్ణాటకలో 8 గంటల కరెంట్ మాత్రమే వస్తున్నట్లు, రేపు తెలంగాణలో కూడా 8, 9 గంటల కరెంట్ మాత్రమే ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది.
- నేను ఆధారాలతో మాట్లాడుతున్నాను. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 8 లో స్పష్టంగా టీజీఆర్పీడీసీఎల్ కు హైయర్ షేర్ ఆఫ్ రిన్యూవబుల్ ఎనర్జీ ఇస్తామని చెప్పారు.
- రిన్యూవబుల్ ఎనర్జీ సోలార్ పవర్ ఉదయం 7 గంటలకు వచ్చి సాయంత్రం 5 గంటలకు ఆగిపోతుంది. థర్మల్, హైడల్ కరెంటును పక్కనపెట్టి, కేవలం పగలు మాత్రమే ఉండే సోలార్ కరెంటును వ్యవసాయానికి ఇస్తూ 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెప్పడం ప్రజలను వంచించడమే.
- ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో కాళేశ్వరం, దేవాదుల, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, సీతమ్మ సాగర్ లాంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ ప్రమాదంలో పడతాయి. నదిలో వరద వచ్చినప్పుడు మోటార్లు రౌండ్ ద క్లాక్ నడిపితే తప్ప ప్రాజెక్టులు నిండవు.
- కేవలం పగలు మాత్రమే కరెంట్ ఇస్తే మోటార్లు ఆన్ అండ్ ఆఫ్ చేయాల్సి వచ్చి, అవి పాడైపోతాయని ఇరిగేషన్ ఇంజనీర్లు స్పష్టంగా చెబుతున్నారు. దీనివల్ల రైతులకు సాగునీరు కూడా అందదు. రోజుకు 18 నుంచి 20 గంటలు నడిస్తే తప్ప మిషన్ భగీరథ లాంటి తాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఇంటింటికీ నీళ్లు అందవు. వర్షాకాలం, చలికాలంలో ఎండ రాకపోతే మంచి నీళ్ల పథకాలు కూడా ఆగిపోయి ప్రజలు అల్లాడిపోతారు.
- ముంబై, బెంగళూరులో లాగా లాభాలు వచ్చే డిస్కంలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టి, ఉచిత కరెంటును పక్కన పెట్టే కుట్రలో భాగంగానే రేవంత్ రెడ్డి ఈ మూడో డిస్కం ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై తక్షణమే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించాలి.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ డిస్కంలు అప్పుల పాలైంది బీఆర్ఎస్ వల్లే అని మాట్లాడటం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనం.
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డిస్కంలకు ప్రభుత్వం రూ.27 వేల కోట్లు బకాయి పడితే, అంటే ఏడాదికి సుమారు రూ.2 వేల కోట్లు అయితే.. ఈ కాంగ్రెస్ పాలనలో డిస్కంలకు ప్రభుత్వం రూ.25,284 కోట్లు బకాయి పడింది. అంటే ఏడాదికి రూ.10వేల కోట్లు అప్పుల పాలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారమే డిస్కంల మొత్తం అప్పు రూ. 55,000 కోట్లుగా ఉంది.
- గత కాంగ్రెస్ పాలనలో తండ్రి చనిపోతే స్నానం చేయడానికి కరెంట్ లేక నెత్తి మీద నీళ్లు చల్లుకొని వచ్చామని సాక్షాత్తూ రేవంత్ రెడ్డే అసెంబ్లీలో చెప్పారు. ఆ చీకటి రోజులను పోగొట్టి విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసింది కేసీఆర్.
- పూటకో పార్టీ మారే రేవంత్ రెడ్డికి నా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు.

నా జీవితమంతా కేసీఆర్ వెంటే. నా పుట్టుక, నా ప్రయాణం అంతా బీఆర్ఎస్ తోనే అని వందసార్లు చెప్పాను. మళ్లీ చెబుతున్నాను.

- ఆర్పీడీసీఎల్ ఏర్పాటును వెంటనే రద్దు చేయాలి. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వకపోతే బీఆర్ఎస్ పక్షాన పెద్ద ఎత్తున విద్యుత్ ఉద్యమాన్ని నిర్మిస్తాం.





## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో.. పటాన్ చెరులోని

# 9 డివిజన్లను క్లీన్ స్వీప్ చేస్తాం!

- ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎగిరేది గులాబీ జెండానే
- త్యాగాల పునాదులు మావి, అబద్దాల చరిత్ర కాంగ్రెస్ పార్టీది
- హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచారు
- ఆరుగ్యారెంటీల పేరుతో అరచేతిలో స్వర్గం చూపించారు
- సీఎస్ఆర్ నిధులను స్థానికంగా ఖర్చుపెట్టకపోతే ప్రజా ఉద్యమం
- రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో పటాన్ చెరులో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేస్తాం
- స్పష్టం చేసిన పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఘనంగా బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమం
- గులాబీమయమైన జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్

**కందిలి, పటాన్ చెరు**

ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ అబద్ధాల పునాదులపై పాలన కొనసాగిస్తోందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దితే.. నేడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇండ్ల కూల్చివేతలు, రైతుల రోదనలు, నిరుద్యోగుల ఆక్రందనలు, హామీల ఎగవేతలతో పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు.

రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేసి, కేసిఆర్ కు గిఫ్ట్ అందిస్తామని ఆయన తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించబోతున్నామన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా, ఎగిరేది మాత్రం గులాబీ జెండాయేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.


**ఘనంగా అవగాహన కార్యక్రమం!**

ఆదివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదు అంశంపై బూత్ లెవెల్ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**వేలాది మందితో..**

**కలెక్టరేట్ ను ముట్టడిస్తాం!**

''పటాన్ చెరు నియోజవర్గంలోనే పరిశ్రమలు ఎక్కువ. ఇక్కడే సమస్యలూ అధికం. నియోజకవర్గం వేగంగా విస్తరిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధులను ముందుగా ఇక్కడే ఖర్చుచేయాలి. ఆ తర్వాతే ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాలి. ఇందుకు విరుద్ధంగా సీఎస్ఆర్ నిధులను తరలిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించని పక్షంలో వేలాది మందితో కలెక్టరేట్ ను ముట్టడిస్తాం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులోనూ స్థానికులకు 10 శాతం కోట ఇవ్వాల్సిందే''నని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పని చేయాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని కోరారు. క్షేత్ర స్థాయిలో ఎలా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయాల్సి ఉంటుందో ఈ సందర్భంగా ఆయన అందరికీ అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.







# 25వ సారి రక్తదానం చేసిన... సీనియర్ అసిస్టెంట్ కిషోర్!

■ ఆపదలో ఉన్నవారికి తానున్నానని అండగా నిలుస్తున్న ప్రభుత్వ ఉద్యోగి

**కందిలి, సంగారెడ్డి :** సంగారెడ్డి కలెక్టరేట్ లోని రెవెన్యూ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ బి.కిషోర్ ఆదర్శంగా నిలిచారు. ఆయన ఇప్పటి వరకు 25 సార్లు రక్తదానం చేయడం విశేషం. ఎవరికైనా అత్యవసరంగా రక్తం కావాలని తనకు సమాచారం వస్తే చాలు.. తాను ఇస్తానంటూ ఆయన ముందుకొస్తారు.ఆదివారం సంగారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మహిళకు అత్యవసరంగా B పాజిటివ్ బ్లడ్ గ్రూప్ కావాలని డాక్టర్లు చెప్పారు.దీంతో కుటుంబ సభ్యులు బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణను సంప్రదించారు. బంగారు కృష్ణ వెంటనే కలెక్టరేట్ రెవెన్యూ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ కిషోర్ కు ఈ విషయాన్ని తెలియజేశారు. ఆయన వెంటనే స్పందించారు. కంది సమీపంలోని బ్లడ్ బ్యాంక్ వద్దకు వచ్చి రక్త దానం చేశారు. మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా బంగారు కృష్ణ మాట్లాడుతూ రక్త దాత కిషోర్ 25వ సారి రక్త దానం చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం కిషోర్ ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు రక్త దాత కిషోర్ కు కృతజ్ఞతలు తెలిపారు.





## చైల్డ్ లేబర్, బాండెడ్ లేబర్ నిర్మూలనకు...

# చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

■ సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్

కందిలి, సంగారెడ్డి: చైల్డ్ లేబర్, బాండెడ్ లేబర్ నిర్మూలనకు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడాలో ఉన్న వీవీ గిరి లేబర్ ఇన్‌స్టిట్యూట్ లో మే 25 నుంచి 29వరకు చైల్డ్ లేబర్, బాండెడ్ లేబర్ నిర్మూలన కార్యక్రమాలపై జాతీయ స్థాయి ట్రైనింగ్ ప్రోగ్రాం జరిగింది. సీఐటీయూ కార్మిక సంఘం ప్రతినిధిగా అతిమేల మానిక్ హాజరయ్యారు.

**అన్ని విభాగాలు...సమన్వయంతో పనిచేయాలి!**

“స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నాయి. అయినా చైల్డ్ లేబర్, బాండెడ్ లేబర్ వ్యవస్థ కొనసాగుతుంది. బాలకార్మిక వ్యవస్థను నిషేధిస్తూ 1986లో చట్టం వచ్చింది. దానికి 2016లో సవరణ చేశారు. 14 ఏళ్ల లోపు వయసున్న పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలి. 1976లో బాండెడ్ లేబర్ వ్యవస్థను నిషేధిస్తూ చట్టం వచ్చింది. ఇన్ని చట్టాలు ఉన్నా, వాటి అమలు తీరు సరిగా లేదు. ఇటుక బట్టీలు, నిర్మాణరంగం, ఫ్యాక్టరీలు, గనులు,హోటల్స్,మాల్స్ లలో ఈ వ్యవస్థలు ఇంకా కొనసాగుతున్నాయి. కార్మిక శాఖ, శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అంతా సమన్వయంతో పనిచేస్తేనే, మంచి ఫలితాలు వస్తాయ”ని అతిమేల మానిక్ అభిప్రాయపడ్డారు. అనంతరం ఆయన సర్టిఫికెట్ అందుకున్నారు.



# భారతీయ జనతా పార్టీకి.. వేణుమాధవ్ రాజీనామా!

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) క్రియాశీల సభ్యత్వానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు నెమలికొండ వేణుమాధవ్ రాజీనామా సమర్పించారు. ఈ మేరకు వేణుమాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన పది సంవత్సరాలుగా భారతీయ జనతా పార్టీలో రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, ముషీరాబాద్, కామారెడ్డి నియోజకవర్గాల ఇన్చార్జిగా, బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర రాష్ట్ర మీడియా కోఆర్డినేటరుగా ఆయన పార్టీకి సేవలు అందించారు. త్వరలోనే తన రాజకీయ భవిష్యత్తు కార్యక్రమాలను వెల్లడిస్తానని వేణుమాధవ్ ఈ సందర్భంగా తెలిపారు. గడిచిన పది సంవత్సరాలుగా పార్టీలో తనకు సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్, బండి సంజయ్, రామచంద్రరావు, ఎంపీ రఘునందన్ రావులకు నెమలికొండ వేణుమాధవ్ ధన్యవాదాలు తెలిపారు. ఆర్ఎస్ఎస్, హిందు వాహిని నేపథ్యం కలిగిన నెమలికొండ వేణుమాధవ్ పార్టీకి రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కందిలి, సంగారెడ్డి



Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com